క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఉయ్యాలవాడ ఎంపీపీ స్కూలులో మొక్క నాటుతున్న ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి

ఉయ్యాలవాడ:ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత సమాజం కోసం మొక్కలు నాటాలని మండల విద్యాధికారి వీరప్రతాప్ రెడ్డి సూచించారు. శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో మొక్కలను నాటారు. విద్యార్థుల భాగస్వామ్యంతో వాటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం



పేపర్ బ్యాగుల తయారు చేసిన చిన్నారులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు:ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని హెచ్‌ఎం రాజా దస్తగిరి అన్నారు. శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పోషణ్ దినోత్సవం నిర్వహణ, ఎకో క్లబ్ ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎంఈఓ రామచంద్రయ్య అన్నీ పాఠశాలలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజాక్‌బాషా, రామనందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సౌభాగ్యం

నంద్యాల(అర్బన్): 18వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈనెల 29న పెన్షన్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై గ్రామ పంచాయతీలకు వచ్చే సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలని ఎంపీడీఓ సౌభాగ్యం కోరారు. స్థానిక ఎంపీడీఓ భవనంలో శనివారం సామాజిక తనిఖీ 18వ విడతపై కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈజీఎస్ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

శిరివెళ్ల: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ నాగార్జునరెడ్డి శనివారం తెలిపారు. మండలంలో మోడల్ స్కూల్, కస్తూరిబా స్కూల్, యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 976 పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. అలాగే విద్యార్థులకు నోట్ పుస్తకాలు కూడా వచ్చాయని, వాటిని ఆయా కళాశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



చింతా వెంకట సుబ్బయ్య (ఫైల్)

ఉయ్యాలవాడ: మండల కేంద్రం ఉయ్యాలవాడకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం చింతా వెంకటసుబ్బయ్య(80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సుమారు 25 ఏళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అప్పట్లో గ్రామస్తులకు చదువు ప్రాముఖ్యతను వివరించి పిల్లలను బడికి పంపేలా చేశారు. ఆయన మరణ వార్త తెలియగానే గ్రామస్తులు, వెంకటసుబ్బయ్య శిష్యులు ఆకుల వెంకట సుబ్బయ్య, నరసింహులు, బాలమద్దిలేటి, చిన్న వెంకటసుబ్బయ్య, తులశన్న, చిన్నరాముడు తదితరులు రిటైర్డ్ హెచ్ఎం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బానకచెర్ల నుంచి నీరు విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి శనివారం 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎస్ఈ వెంకటరమణయ్య గేట్ల వద్ద పూజ చేసి స్విచ్ ఆన్ చేసి గేట్లు ఎత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్‌ఎంసీ కాలువ ద్వారా 10వేల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుందన్నారు. ఈ నీటిని తెలుగుగంగ (వీబీఆర్)కు 9000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా జీఎన్ఎస్ఎస్‌కు ఇప్పుడు నీరు విడుదల చేయబోమని వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈ పార్థసారధి, డీఈఈలు నాగేంద్రకుమార్, ఉదయ్‌కుమార్ రెడ్డి, ఏఈఈ దేవేంద్ర, విశ్వనాథ్, ఏఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

- కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సులో ఆళ్లగడ్డ డీఎస్పీ



కొత్త చట్టాలపై ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్



సదస్సుకు హాజరైన మహిళా పోలీసులు, ప్రజలు

చాగలమర్రి: నేరాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలు తీసుకొచ్చినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో చాగలమర్రి పోలీసు స్టేషన్ వద్ద కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు మన దేశంలో బ్రిటీష్ కాలం నాటి చట్టాలే ఉన్నాయన్నారు. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరికత సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) చట్టాలు ఇటీవల అమలులోకి వచ్చాయన్నారు. ఈ కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతిలో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరిగా వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు అందుబాటులోకి రానున్నాయన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల మాదిరిగా శిక్షకు కాకుండా న్యాయం అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కేంద్రం కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించిందన్నారు. జులై 24వ తేది నుంచి అమలులోకి వచ్చిన ఈ కొత్త చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంలో రూ.50 కంటే ఎక్కువ ఆస్తి నష్టం వాటిల్లితే కేసు నమోదు చేసేవారని ప్రస్తుత కొత్త చట్టం ప్రకారం రూ.20 వేల కంటే ఎక్కువ ఆస్తి నష్టం జరిగితేనే కేసు నమోదు అవుతుందన్నారు. అనంతరం విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా డీఎస్పీ సిబ్బందితో కలిసి స్థానిక టోల్ ప్లాజా వద్ద సాయంత్రం 5గంటల నుంచి 7 గంటల మధ్య వాహనాల తనిఖీ నిర్వహించారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీదేవి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, ఇతరుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని దిశా పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యమౌళి, ఎస్ఐ కుమారి, న్యాయవాది శ్రీదేవి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల రక్షణ అంశంపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. పిల్లలను దోపిడీ చేసే తీరుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేసి బాల,బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ధైర్యంగా ఉండి వారి హక్కుల కోసం పోరాడాలన్నారు. ఏవైనా సమాచారం ఇవ్వాలంటే పక్కనే ఉన్న దిశా పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు మద్దయ్య, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో శాంతి భద్రతలు క్షీణించాయి



మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలో శాంతి భద్రతలు క్షీణించాయని, టీడీపీ నాయకుల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్ రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు కొందరు వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లు చేయడం ఏంటని ప్రశ్నించారు. మునిసిపల్ షాపుల అద్దెలు తమకే కట్టాలని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ఓ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి బలవంతంగా డబ్బు లాక్కెళ్లారన్నారు. చాకలిశీను కేసులో ఇప్పటి వరకు ముద్దాయిలను అరెస్టు చేయక పోవడంపై ప్రశ్నించారు. ప్రస్తుతం ఆళ్లగడ్డలో వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. జనసేన వల్లనే ఆళ్లగడ్డలో టీడీపీ గెలిచిందన్నారు. అయితే, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అఖిలప్రియ తమ్ముళ్లం, భార్గవ్‌రామ్ మనుషులం అంటూ భయపెడుతున్నారని చెప్పారు. రాత్రి 8గంటలు దాటితే జనం బయట తిరిగేందుకు జంకుతున్నారని చెప్పారు. గత కొన్ని రోజుల నుంచి బెంగళూరు నుంచి కల్తీ మద్యం తెచ్చి ఆళ్లగడ్డలో అమ్ముతున్నారన్నారు. జిల్లా ఎస్పీ స్పందించి లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయకపోతే ఆళ్లగడ్డలో ఎన్నో అరాచకాలు జరిగే ప్రమాదం ఉందని చెప్పారు.

ఆధ్యాత్మికం

శాకాంబరీగా గాయిత్రీదేవి



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది ఆలయ ఆవరణలో వెలసిన గాయిత్రీమాతను శాకాంబరిగా అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తర్వాత కాయగూరలు, ఆకుకూరలు, ఫలాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు అమ్మవారికి మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణసేవ సంఘం అధ్యక్షుడు కరణం మురళీకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది లోకకల్యాణం కోసం అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో శాశ్వత అధ్యక్షుడు కాదరబాద్ రవీంద్రనాథ్, డాక్టర్ హైయగ్రీవాచార్యులు, సుధీర్, కేశవమూర్తి, అర్చకులు సీతారామ్‌శర్మ, సుగుణకుమార్, దత్తు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్. జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి, శ్రీలక్ష్మి నరసింహ కంబగిరి స్వామి, శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకొని అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అర్చకులు నరసింహస్వామి, భాస్కర్‌శర్మ, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లమలలోని వన్యప్రాణులను పరిరక్షించాలి

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని చెంచు గిరిజనులు పర్యావరణం, వన్యప్రాణులను సంరక్షించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని బైర్లూటీ చెంచుగూడాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. పోతిరెడ్డిపాడు వద్ద సాగునీటిని విడుదల చేసిన అనంతరం బైర్లూటీకి చేరుకున్న కలెక్టర్ చెంచులతో కొంతసేపు ముచ్చటించారు. ఆమె మాట్లాడుతూ అభయారణ్యంలో వన్యప్రాణులు ఎంతో కీలకమైనవన్నారు. ఇటీవల వన్యప్రాణులు అంతరిస్తున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. గిరిజనగూడేల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. గిరిజనులకు వైద్య, విద్య, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం బైర్లూటీ జంగిల్ సఫారి కేంద్రాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.

ఉద్యోగాలకు 17మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 80 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో 17 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ బాబాఫకృద్దీన్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, కుమార్, లీలామాధవ్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో రక్ష

చాగలమర్రి: పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ వేయించాలని, ఇది వారికి రక్షనిస్తుందని సీహెచ్‌ఓలు కవిత, చంద్రకళ, నర్మద అన్నారు. శనివారం ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో టీడీ, డీపీటీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జీవయ్య, ఎస్‌టీ షాకీర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు ఏపీజే అబ్దుల్ కలాం



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం కోటయ్య

చాగలమర్రి: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శనీయులని హెచ్‌ఎం కోటయ్య అన్నారు. శనివారం ఆయన 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కలాం చిత్ర పటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం మన దేశపు మిస్సైల్ మ్యాన్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి 2002లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించారన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలకుగాను దేశపు అత్యున్నత పురస్కారమైన భారతరత్న వరించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, మహబుబ్‌బాషా, శాస్త్రి, శివశంకర్, పీడీ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబరు 117ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీఓనంబరు 117ను రద్దు చేసి 55వ జీఓ ప్రకారం పాఠశాలల్లో టీచర్లను కేటాయించాలని యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ కోరారు. శనివారం వారు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పద్మజకు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒకే పాఠశాలగా నడపాలని, ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన మెనూ సవరించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలలకు రావాల్సిన అన్ని రకాల గ్రాంట్లు, విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణుడు, రామ్మోహన్, కాశీం, అరవిందకుమార్, జాన్సన్, రామకృష్ణారెడ్డి, ప్రేమకాంత్, బాలస్వామి, శేఖర్, శివశంకర్ పాల్గొన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడిన మేకపోతు

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం వద్ద శనివారం గొర్రెలు, మేకల మందపై చిరుత దాడి చేసింది.ఈ ఘటనలో ఓ మేక పోతుకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మొహరం వేడుకల్లో భాగంగా రెండు రోజుల్లో జియారత్ నిర్వహించాల్సి ఉంది. అందుకోసం కొన్ని మేక పోతులు కొనుగోలు చేసి గొర్రెల మందలో వదిలారు. దిన చర్యలో భాగంగా గొర్రెల కాపరి మందను తోలుకొని గ్రామానికి సమీపంలో ఉన్న వినాయక ప్లాంటేషన్‌వైపు వెళ్లాడు. సాయంత్రం ప్లాంటేషన్ పొదల్లో నుంచి చిరుత గొర్రెల మందలోని ఓ మేక పోతుపై దాడి చేసింది. దూరంగా ఉన్న కాపరి వెంటనే చిరుత మీదకు రాళ్లు విసరగా అది పారి పోయింది. చిరుత దాడి విషయం చుట్టు పక్కల గ్రామాలకు పాక్కడంతో అటవీ సమీప పొలాల్లో ఉనన రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు దృష్టికి తీసుకెళ్లగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, చిరుత బయటకు రాకుండా అడవిలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం: మండలకేంద్రంలోని స్థానిక ఎస్సీ కాలనీలో ప్రహ్లాదుడు, జయంతి దంపతులకు చెందిన గుడిసె శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కాలిపోయింది. వంట చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో గుడిసె, అందులో ఉన్న వస్తు సామగ్రి మొత్తం కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

ముగిసిన ఆధార్ మొబైల్ క్యాంపులు

దొర్నిపాడు:మండలంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ క్యాంపులు ముగిసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం తెలిపారు. మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, కొండాపురం, దొర్నిపాడు, గుండుపాపల గ్రామాల్లో మొత్తం 386 మందికి ఆధార్ కార్డుల్లో సవరణలు చేసినట్లు చెప్పారు.

ఉయ్యాలవాడ: మండలంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ సేవలు శనివారం ముగిశాయి. తుడుములదిన్నె, మాయలూరు, హరివరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో పుట్టినతేది, చిరునామాలు, ఫోన్ నంబర్ లింకు మరియు ఇతర సవరణలు చేశారు. సుమారు 226 మందికి మార్పులు చేర్పులు చేసినట్లు కార్యదర్శులు సతీష్‌కుమార్, సురేష్‌బాబు, రాజశేఖర్ తెలిపారు.

చాగలమర్రి: మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేది వరకు నిర్వహించిన ఆధార్ ప్రత్యేక కాంపుల్లో సుమారు 170 మందికి వివిధ రకాల ఆధార్ సేవలను అందించినట్లు నిర్వాహకులు క్రిష్ణమోహన్ రెడ్డి, నాగకిరణ్, హేమంత్‌రెడ్డి తెలిపారు.

వైద్య విజ్ఞాన సదస్సులను వినియోగించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ విజయేంద్ర

నంద్యాల(వ్యవసాయం): నేటి యువ వైద్యులు వైద్య విజ్ఞాన సదస్సులను వినియోగించుకోవాలని, భవిష్యత్తులో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవి దోహదపడతాయని జాతీయ స్థాయి ప్రముఖ చెవి, ముక్కు గొంతు చికిత్స నిపుణులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ విజయేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక మధుమణి నర్సింగ్ హోం సమావేశ భవనంలో ఏపీ ఈఎన్‌టీ వైద్యుల సంఘం మధుమణి చారిటబుల్ సొసైటీ సహకారంతో రాష్ట్రస్థాయి చెవి, ముక్కు గొంతు శస్త్ర చికిత్సల వైద్య విజ్ఞాన ప్రత్యక్ష ప్రసారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మధుసూదన్ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్స వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు రాష్ట్రాల నుంచి 200మంది ఈఎన్‌టీ వైద్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రవి కృష్ణ, మణిదీప్, దీపక్ హల్దీపూర్, విద్యాసాగర్, వినయ్, విజయేంద్ర, రోహిత్, సహదేవుడు, మధుమణి, మధుప్రీతి, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం



పెద్దఎమ్మనూరులో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ ధరణి

ఉయ్యాలవాడ: రైతులు లాభదాయక పంటలైన పండ్లతోటల సాగుకు శ్రీకారం చుట్టాలని ఉద్యానశాఖ అధికారి(ఏఈఓ) ధరణి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని పెద్ద ఎమ్మనూరు, నర్సిపల్లె, పడిగపాడు గ్రామాల్లో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్లతోటల సాగు చేసే సన్నచిన్నకారు రైతులకు వాటి సంరక్షణ కోసం జాతీయ ఉపాధిహామీ పథకం కింద మూడేళ్ల పాటు వందశాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ రవిప్రకాశ్ మాట్లాడుతూ మండలానికి 100 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 90 ఎకరాల్లో పండతోటలు సాగుచేసేందుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. ఈ పథకంలో భాగంగా మామిడి, చీని, నిమ్మ, సపోట, నేరేడు, జామ, డ్రాగన్ ఫ్రూట్ తదితర 16 రకాల పండ్లతోటలు రైతులు ఎంపిక చేసుకోని సాగుచేసుకోవచ్చన్నారు. ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌బాషా, ఈసీ షరీఫ్‌బాషా, టీఏ ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

చాగలమర్రి: ఉపాధిహామి పథకం కింద ఉద్యాన పంటల సాగుపై శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో ఏపీఓ నిర్మలాదేవి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 149 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగుకు రైతులను గుర్తించామని తెలిపారు. ఈ పంటల సాగుకు ఆసక్తి గల రైతులు తమ పొలానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏట్ల మహేశ్వరి, సచివాలయ సిబ్బంది రాధాకృష్ణ, టీఏ వెంకటన్న, ఎఫ్ఏ రత్నమ్మ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము, మాజీ డీవైఎఫ్ఐ నాయకులు శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో రాము అధ్యక్షతన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ప్రారంభమయ్యాయి. ముందుగా డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ వ్యవస్థ పెరిగి పోతుందన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేక కూలీ పనులకు వెళ్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాంభూపాల్, మధుశేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి



జంప్‌రోప్ పోటీలు ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, జంప్‌రోప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అండర్-12, 14 సబ్‌జూనియర్ విభాగంలో బాల బాలికలకు రాష్ట్రస్థాయి పోటీలకు 16 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వారందరికీ భోజన వసతి ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో క్రీడాభారతి అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ న్యాయవాది ఖాదరబాద్ , వెంకటేశ్వర విద్యామందిర్ చైర్మన్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

హాకీ ఫైనల్ పోటీల్లో ఎస్పీజీ విద్యార్థిని విజయం



లహరి

నంద్యాల(న్యూటౌన్): హాకీ ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో నంద్యాల ఎస్పీజీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థిని లహరి విజయం సాధించారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత, స్టీఫెన్ శనివారం తెలిపారు. కేరళలో ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు సెకండ్ హాకీ ఇండియా సబ్ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్, 2024 హాకీ ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో విజేతగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లహరిని హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో ఎంసీఏ, ఎమ్మెస్సీ, కంప్యూటర్ సైన్స్, ఎంటెక్‌లో కనీసం 50 శాతం మార్కులతో పీజీ పాసైన అభ్యర్థులు, పీహెచ్‌డీ లేదా నెట్, సెట్, స్లాట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. విద్యార్హతలతో కూడిన బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను ఆగస్టు 1వ తేదీలోపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెయిల్ ndf2.jkc@fmai .com ద్వారా పంపాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 6302146800 నంబరుకు సంప్రదించాలన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రికి మొక్కను అందజేస్తున్న జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా శనివారం కలిశారు. ఇటీవలే ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరిస్తానని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నేరుగా అధికారులతో మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫిరోజ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.